www.prajasakti.com

ప్రజాశక్తి

సోమవారం 3 నవంబర్ 2025

5

కాకినాడ



సంతోష్‌కు కాంస్య పతకం



ప్రజాశక్తి - పెద్దాపురం

మంగోలియా దేశంలో జరిగిన ఏషియన్ స్కూల్స్ రాపిడ్ చెస్ ఛాంపియన్ షిప్ పోటీల్లో పెద్దాపురంకు చెందిన ముప్పన జ్ఞానసాయి సంతోష్ కాంస్య పథకం గెలుచుకున్నాడు. స్థానిక కస్పాపేటకు చెందిన ముప్పన్న పవన్‌కుమార్, కోమలి దంపతుల కుమారుడు జ్ఞానసాయి సంతోష్ వైఆర్ఎల్ జూనియర్ కళాశాలలో సెకండ్ ఇంటర్ చదువుతున్నాడు. ఇటీవల శ్రీ ప్రకాష్ సినర్జీ స్కూల్లో జరిగిన జాతీయస్థాయి చెస్ పోటీలో ఈ విద్యార్థి ప్రథమ స్థానం సాధించాడు. ఈ సందర్భంగా జ్ఞాన సాయి సంతోష్‌ను మన పెద్దాపురం ఫేస్‌బుక్ అడ్మిన్ పెదిరెడ్డి నరేష్, పెద్దాపురం చరిత్ర పరిశోధకులు వంగలపూడి శివకృష్ణ అభినందించారు.

పార్కుల ప్రయివేటీకరణ తగదు

ప్రజాశక్తి - కాకినాడ

నగరంలో ప్రజాధనంతో అభివృద్ధి చేసిన పార్కులను ప్రయివేటీకరణ చేయడం తగదని ప్రజా సంఘాల నాయకులు అన్నారు. ఆదివారం ప్రజాసంఘాల ఆధ్వర్యంలో స్థానిక రాజా ట్యాంక్ వివేకానంద పార్కు వద్ద సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా పెన్షనర్ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సత్తిరాజు, ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ నాయకురాలు కె.నాగజ్యోతి మాట్లాడుతూ ఆదాయం సమకూర్చుకునే పేరుతో ఇప్పటికే అభివృద్ధి చేసిన పార్కులను ప్రయివేటు వారికి అప్పగించడం సమంజసం కాదన్నారు. పట్టణాలు, నగరాల్లో పచ్చని వాతావరణం కరువైపోతుందన్నారు. వ్యక్తిగత నివాసాల స్థానంలో సామూహిక నివాసాలు, అపార్టుమెంట్లు పెరగడం వల్ల పచ్చదనానికి అవకాశం ఉండడం లేదన్నారు. ఈ నేపథ్యంలో సామాన్య మధ్యతరగతి కుటుంబాలకు ఉద్యానవనాలే ఆహ్లాదానికి ఆనందానికి చిరునామాగా ఉన్నాయన్నారు. కావున నగరపాలక సంస్థ ప్రత్యేక అధికారిగా ఉన్న కలెక్టర్ నగరంలో పార్కుల ప్రయివేటీకరణ ప్రతిపాదన విరమించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు జి.ప్రభాకరవర్మ, సిహెచ్‌వి. రమణ, ఎస్ఎఫ్ఐ నాయకులు సత్యం, జైరాం, లోవరాజు, కరుణ, డివైఎఫ్ఐ నాయకుడు కె.సూర్య, ఐద్వా నాయకురాలు జి.భూలక్ష్మి, శ్రామిక మహిళా నాయకులు భారతి, పద్మ, సిఐటియు నాయకులు మలక వెంకటరమణ, నాగాబత్తుల సూర్యనారాయణ, మేడిశెట్టి వెంకటరమణ, పలివెల వీరబాబు పాల్గొన్నారు.



ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సంతకాల సేకరణ చేస్తున్న నాయకులు

బాధితులకు అండగా ప్రభుత్వం

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

తుపాను బాధితులకు కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తుందని ఎంఎల్ఎ పంతం నానాజీ అన్నారు. ఆదివారం తూరంగిలోని పగడాలపేట ఉన్నత పాఠశాలలో తుపాను ప్రభావితులైన 900 మంది మత్స్యకార కుటుంబాలకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మొంథా తుపాను బాధితులకు కూటమి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందనిఅన్నారు. అధికారులు, కూటమి పార్టీల నాయకులు ఐక్యంగా పనిచేసి తుపాను బాధితులకు అండగా నిలచారని అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు, ఎంఎల్‌సి కర్రి పద్మశ్రీ, టిడిపి రూరల్ కో కో-ఆర్డినేటర్ కటకంశెట్టి బాబీ, తహశీల్దార్ ఎస్ఎల్.కుమారి, ఎంపిపి అనంతలక్ష్మీ, కూటమి నాయకులు పెంకే శ్రీనివాస్‌బాబా డాక్టర్ నులుకుర్తి వెంకటేశ్వరరావు, రంబాల వెంకటేశ్వరావు, రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ డైరెక్టర్ కుమారస్వామి, రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ వల్లూరి రాజా, పాల్గొన్నారు.

ఎకరాకు పంట నష్టం రూ.25 వేలు ఇవ్వాలి

ప్రజాశక్తి - తాళ్లరేవు, కాజులూరు



తాళ్లరేవులో రైతులతో కలిసి పోలాలను పరిశీలిస్తున్న రాజబాబు

తుపాను ప్రభావంతో పంటను కోల్పోయిన రైతులకు నష్ట పరిహారంగా రూ.25 వేలు ఇవ్వాలని ఎపి కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి వల్లు రాజబాబు డిమాండ్ చేశారు. ఆదివారం తాళ్లరేవు మండలంలోని పోలేకుర్రు, జార్జిపేట, పి మల్లవరం గ్రామాలతోపాటు, కాజులూరు మండలంలోని చేదువాడ గ్రామంలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన పంట పొలాలను పరిశీలించి, రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొంథా తుపాను వల్ల రైతులకు భారీ నష్టం జరిగిందన్నారు. ఈ నష్టాన్ని ప్రభుత్వం అంచనా వేసి పంట నష్టం ఇవ్వాలనికోరారు. ఇప్పటికే కౌలు వ్యవసాయం గిట్టుబాటు గాక వలసలు పెరిగాయని అన్నారు. పెరిగిన ఎరువులు, పురుగు మందుల ధరలు, ప్రకృతి నష్టాలు ప్రభుత్వ ఆదరణ కరువై రైతులు అప్పుల పాలవుతున్నారన్నారు. పంట నష్టం అంచనా వేసేందుకు గడువు పెంచాలని, ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని క్వింటాకు రూ.50 బోనస్ ఇవ్వాలని కోరారు. ఆయా పర్యటనల్లో దంగేటి గణేశ్వరరావు, మందపాటి చిన్నబ్బాయి, దడాల శ్రీను, దడాల కొండ, పొనుగుమట్ల సింహాద్రి, చేదువాడ సర్పంచ్ గంజా సూరిబాబు, కుడిపూడి భూచక్రం, పెంకే సూర్యనారాయణరెడ్డి, నరసింహమూర్తి, గంజా కొండా, కురుపుడి కోటేశ్వరరావు, కాదా కొండ పాల్గొన్నారు.

కబడ్డీ బాలురు, బాలికల జట్ల ఎంపిక

ప్రజాశక్తి - సామర్లకోట

35వ జూనియర్ కబడ్డీ ఛాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనేందుకు జిల్లా కబడ్డీ బాలురు, బాలికల జట్లు ఎంపిక జరిగింది. ఆదివారం స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో జరిగిన ఈ పోటీల్లో జిల్లా నలుమూలల నుంచి బాలురు 60 మంది, బాలికలు 65 మంది పాల్గొన్నారు. ఈ పోటీల్లో ఉత్తమ ప్రదర్శన చేసిన క్రీడాకారులను రాష్ట్ర స్థాయిలో పాల్గొనేందుకు ఎంపిక చేసినట్లు కబడ్డీ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి కొండపల్లి శ్రీనివాసరావు తెలిపారు. పోటీల్లో ఎంపికైన క్రీడాకారులు ఈనెల 7వ తేదీ నుంచి 9వ తేదీ వరకూ కర్నూలు జిల్లాలో జరిగే పోటీల్లో పాల్గొంటారన్నారు.



ఎంపికైన క్రీడాకారులను అభినందిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

ఎంపికైన క్రీడాకారులు వీరే..

బాలుర జట్టులో త్రిమూర్తులు, గంగబాబు, వంశీ, కార్తీక్, జాన్, అభిరామ్, జాన్‌ప్రకాష్, కె.రాజు, జి.సూర్యదుర్గాప్రసాద్, ఆర్.ఆనంద్‌బాబు, పి.సురేంద్ర, ఎన్.సువర్ణరాజు, బి.అజయ్, డి.రంజిత్ ఉన్నారు. బాలికల జట్టులో కె.అరుణశ్రీ, జె.లక్ష్మీదుర్గ, సిహెచ్.భవాని, ఎం.బాలసత్యశ్రీ, ఎ. గంగాభవాని, కె.అఖిల, సిహెచ్.లక్ష్మీప్రత్యూష, బి.హేమవరలక్ష్మి, ఎస్.దేవిశ్రీ, ఎం.విరోనిక, కె.రీతిక, ఎస్.నవ్య, పి.శ్రీలక్ష్మి, బి.జోస్నా ఉన్నారు. ఎంపికైన క్రీడాకారులను ఇంటర్నేషనల్ కోచ్ సాయిప్రసాద్, ప్రో కబడ్డీ రిఫరీ మురళీకుమార్, ఇంటర్నేషనల్ రిఫరీ వాసు, రిటైర్డ్ పిఇటి తాళ్లూరు వైకుంఠం, ఇతర పిఇటీలు, కబడ్డీ అసోసియేషన్ జిల్లా ట్రెజరర్ నిమ్మకాయల కిరణ్‌కుమార్, జిల్లా అధ్యక్షులు డివివిఎస్.శ్రీనివాస్, హైస్కూల్ హెచ్‌ఎం తోటకూర సాయిరామకృష్ణ అభినందించారు.

క్రీడా వికాస కేంద్రం పూర్తయ్యేదెప్పుడో?

ప్రజాశక్తి - జగ్గంపేట

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద నిర్మిస్తున్న క్రీడా వికాస కేంద్రం పనులు ప్రారంభించి ఎనిమిదేళ్లు గడిచిన ఇంకా పూర్తికాలేదు. గత టిడిపి ప్రభుత్వంలో ఇండోర్ స్టేడియం నిర్మాణానికి సిఎం చంద్రబాబు రూ.2 కోట్లు నిధులు మంజూరు చేసి శంకుస్థాపన చేశారు. ఆ ప్రభుత్వంలో బిల్డింగ్ నిర్మాణాన్ని కాంట్రాక్టర్ ప్రారంభించారు. తదుపరి ఎన్నికలు రావడం ఆ ప్రభుత్వంలో చేసిన బిల్లులు అన్నింటిని వైసిపి ప్రభుత్వం నిలిపివేసింది. నాటి కాంట్రాక్టర్ బిల్డింగ్ నిర్మాణాన్ని చాలా వరకు పూర్తి చేశారు. చేసిన పనులకు బిల్లులు ఇవ్వకపోవడంతో అతను బిల్డింగ్ పనులు నిలిపివేసి స్టేడియం లోపలికి ఎవరు వెళ్లకుండా గోడలు కట్టేశారు. అలా సుమారు నాలుగేళ్లు ఉండిపోయింది. అయితే వైసిపి పాలన చివరలో ఆంధ్రప్రదేశ్ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో ఫినిషింగ్ పనులు పూర్తి చేశారు. ఇండోర్‌లో ఫ్యాన్లు ఏర్పాటు చేశారు. ఇక లోపల కలప పని మాత్రమే మిగిలి ఉంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పనులను పూర్తి చేస్తారని అందరూ భావించారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 16 నెలలు అయినా ఆ దిశగా దృష్టి సారించకపోవడంపై విమర్శలు వస్తున్నాయి. స్థానిక ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ స్టేడియం విషయంలో ప్రత్యేక దృష్టి సారించాలని పిడిఎస్‌యు విజృంభణ రాష్ట్ర కార్యదర్శి కడితి సతీష్ కోరారు.



నిరుపయోగంగా ఉన్న క్రీడా వికాస కేంద్రం

తాగునీటి సమస్యను పరిష్కరించాలి

ప్రజాశక్తి - కాజులూరు

ప్రజలు ఎదుర్కొంటున్న తాగు నీటి సమస్యలను పరిష్కరించాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు టేకుమూడి ఈశ్వరరావు డిమాండ్ చేశారు. ఆదివారం సంఘం ఆధ్వర్యంలో కాజులూరు శివారు ఒంటితాటి గ్రామస్తులు తాగునీటి కోసం ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒంటితాడి గ్రామస్తులు గత కొన్ని రోజులుగా తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. 10 రోజులకోసారి తాగునీటిని సరఫరా చేస్తున్నారని, అదైనా ఒక్కొక్కరికి ఒకటి, లేదా రెండు బిందెలకు మించి నీరు రావడం లేదన్నారు. తాగునీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడుతున్నా ఆర్ డబ్ల్యూఎస్, పంచాయతీ అధికారులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. తమ ఇబ్బందులను పంచాయతీ అధికారుల దృష్టికి పలు దఫాలుగా తీసుకెళ్లినా ఏమాత్రం స్పందించడం లేదని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల తాగునీటి ఇబ్బందులపై నియోజకవర్గ ఎంఎల్ఎ, మంత్రి వాసంశెట్టి సుభాస్ గ్రామ ప్రజల తాగునీటి ఇబ్బందులపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానికులు దున్న ఆదినారాయణ, దండంగి సమర్పణరావు, పువ్వల భైరవమూర్తి, దండంగి సత్యనారాయణ, బిల్లా అనంత, దండంగి సుగుణ, మల్లాడి కుమారి, పొన్నాడ వీరబాబు, కొల్లు లావుకుమారి పాల్గొన్నారు.



నిరసన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఈశ్వరరావు

లెవెల్ గేజ్‌ల ఏర్పాటుకు ప్రతిపాదనలు

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

ఏలేరు రిజర్వాయర్ వరద నీటితో పంట పొలాలు ముంపునకు గురికాకుండా ఉండేందుకు లెవెల్ గేజ్‌లు ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు రూపొందించినట్లు గోదావరి తూర్పు డెల్టా ప్రాజెక్టు ఛైర్మన్ మురలశెట్టి సునీల్‌కుమార్ తెలిపారు. ఆదివారం ఆయన వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిఠాపురం బ్రాంచ్ కెనాల్‌కు సామర్లకోట లాకులు నుంచి గోదావరి జలాలు, 2 రెగ్యులేటర్, గొల్లప్రోలు కలింగలు నుంచి ఏలేరు జలాలు కలుస్తున్నాయన్నారు. దీనివల్ల అధిక నీటి మట్టం ఏర్పడుతుందని, దాని నివారణకు వాటర్ లెవెల్ గేజులు చాలా ముఖ్యమని భావిస్తున్నట్లు తెలిపారు. రెగ్యులేటర్లు, వంతెనలు, స్లూయిజ్‌ల వద్ద వాటర్ లెవెల్ గేజ్‌లు ఏర్పాటు చేయవలసిన అవసరం ఉందన్నారు. దీనిపై ధవలేశ్వరం సర్కిల్ ఎస్ఇ గోపీనాథ్‌కు ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలను అందించినట్లు తెలిపారు. ఈ ప్రతిపాదనను డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకువెళ్లనట్లు సునీల్‌కుమార్ తెలిపారు.



ఇరిగేషన్ ఎస్ఇతో చర్చిస్తున్న సునీల్‌కుమార్

పత్తి రైతుకు తీరని నష్టం

ప్రజాశక్తి - రౌతులపూడి

మొంథా తుపాను, అంతకు ముందు కురిసిన వర్షాలతో పత్తి రైతులకు తీవ్రంగా నష్టపోయాడు. పత్తి పంట చేతికందే సమయంలో వచ్చిన విపత్తుతో సర్వం కోల్పోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రత్తిపాడు నియోజకవర్గంలోని ప్రత్తిపాడు, శంఖవరం, రౌతులపూడి మండలాల్లో సుమారు 1700 ఎకరాల్లో పత్తి పంట సాగు అవుతోంది. ఇప్పటి వరకూ ఎకరాకి సుమారు రూ.50 వేల వరకూ రైతులు పెట్టుబడి పెట్టారు. ప్రత్తిపాడు మండలంలో సుమారు 700 ఎకరాల్లో పత్తి పంట సాగైయింది. తుపాను ప్రభావంతో సుమారు 30 ఎకరాల్లో పంట నాశనం అయిందని అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. రౌతులపూడి మండలంలో 700 ఎకరాలలో పత్తి సాగు జరిగింది. ఇందులో 200 ఎకరాల్లో మొదటి క్రాప్ పూర్తిగా పోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే అధికారులు మాత్రం ఇక్కడ పత్తి పంటకు నష్టం వాటిల్లలేదని చెప్పడం గమనార్హం. శంఖవరం మండలంలో 300 ఎకరాలలో పత్తి పంట సాగు చేయగా, గత పది రోజులుగా కురిసిన వర్షాలు, తుపాను ప్రభావంతో మొదటి క్రాఫ్ పూర్తిగా నష్టపోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలు, మార్గదర్శకాలను సడలింపు చేసి నష్టపోయిన ప్రతీ ఎకరాకు ఇన్‌పుట్ సబ్సిడీ ఇప్పించేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



రౌతులపూడిలో ఎండిపోయిన పత్తి పంట

జోగి రమేష్ అరెస్టుకు ఖండన

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

మాజీ మంత్రి జోగి రమేష్ అరెస్టును వైసిపి మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జమ్మలమడక నాగమణి ఆదివారం ఒక ప్రకటనలో ఖండించారు. టిడిపి నేతలు చేసిన అక్రమాలకు వైసిపి నేతల అరెస్టులతో డైవర్షన్ పాలిటిక్స్‌కు తెరలేపారని మండిపడ్డారు. నకిలీ మద్యాన్ని తయారు చేసింది టిడిపి నేతలైతే జోగి రమేష్‌ను అరెస్టు చేయడం ఏంటని ప్రశ్నించారు. అలాగే టిటిడి సాక్షిగా కూటమి ప్రభుత్వం కక్ష రాజకీయాలకు పాల్పడుతుందన్నారు. వైసిపి సీనియర్ నేత వైవి.సుబ్బారెడ్డిపై కక్షతోనే ఆయన వద్ద పని చేసిన చినఅప్పన్నకు ప్రభుత్వం అక్రమంగా అరెస్టు చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం చేసిన ఆరోపణలపై వైవి సుబ్బారెడ్డి విచారణ కోసం సుప్రీంకోర్టును ఆశ్రయించారని అన్నారు. కూటమి ప్రభుత్వ పాలనలో దేవాలయాల్లో తొక్కిసలాట ఘటనలు ఆందోళన కల్గిస్తున్నాయని అన్నారు. ఇటువంటి దారుణాలు ప్రజల్లోకి వెళ్లకుండా పక్కదోవ పట్టించేందుకు కుట్రపూరితంగా కేసులను తెరపైకి తెస్తుందని విమర్శంచారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - గొల్లప్రోలు

ఆర్‌డిఎస్ఎస్ స్కీంలో గ్రామాలకు 24 గంటలు త్రీఫేస్ విద్యుత్ లైన్ల నిర్మాణం చేసేందుకు సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఎపిఇపిడిసిఎల్ ఇఇ ప్రభాకర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. చేబ్రోలు పరిశ్రమలు, తాటిపర్తి, చిన్న జగ్గంపేట గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు చెప్పారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

నేడు పాడా కార్యాలయంలో పిజిఆర్ఎస్

ప్రజాశక్తి - పిఠాపురం

స్థానిక పాడా కార్యాలయంలో సోమవారం పిజిఆర్ఎస్ కార్యక్రమం యథావిధిగా జరుగుతుందని పాడా పీడీ ఎ.చైత్రవర్షిణి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తామని తెలిపారు. పిజిఆర్ఎస్ రాలేనివారు వారి అర్జీలను Meekosam.ap.gov.in వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవచ్చునని తెలిపారు. పిఠాపురం నియోజకవర్గానికి సంబంధించిన డివిజనల్, మండల స్థాయి అధికారులు అందరూ విధిగా హాజరు కావాలని ఆదేశించారు.

4న చెకుముకి సైన్స్ సంబరాలు

ప్రజాశక్తి - గొల్లప్రోలు

ఈ నెల 4వ తేదీన స్థానిక జడ్‌పి బాలికల ఉన్నత పాఠశాలలో మండల స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు నిర్వహిస్తున్నట్లు జెవివి మండల అధ్యక్షులు ఏలేటి నానిబాబు, చెకుముకి మండల కన్వీనర్ అనిశెట్టి సీతారామరాజు, హెచ్‌ఎం సిహెచ్.సూర్యప్రకాశ్‌రెడ్డి తెలిపారు. 6, 7 తరగతుల విద్యార్థులు జూనియర్స్ విభాగంలోనూ, 8, 9, 10 తరగతి విద్యార్థులు సీనియర్స్ విభాగంలో పోటీలు నిర్వహిస్తారని అన్నారు. పాఠశాలలో మొదటి స్థానం పొందిన ఒక్కో విద్యార్థి మండల స్థాయికి హాజరుకావాలని సూచించారు. ఎంపికైన విద్యార్థులు మధ్యాహ్నం 12 గంటలకు పాఠశాలకు చేరుకోవాలన్నారు.

మరిడమ్మ ఆలయంలో అన్నదానం

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక మరిడమ్మ ఆలయంలో ఆదివారం ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కె.విజయలక్ష్మి ఆధ్వర్యంలో యాత్రికులకు అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రతి ఆదివారం దాతల సహకారంతో యాత్రికులకు అన్నదానం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వేద పండితులు ఐవి.ప్రసాద్‌శర్మ, ఎన్‌వి.అవధాని, శంకర్, ఆలయ ఆసాధులు రాయి నాని, రామచంద్రప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

రాజుకు ఉత్తమ సేవా రత్న అవార్డు


ప్రజాశక్తి - కరప

మానవత్వం స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు జొన్నలగడ్డ రాజు చేస్తున్న సేవలను గుర్తించి శ్రీపొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయం ఉత్తమ సేవా రత్న అవార్డును అందజేశారు. హైదరాబాదులో విశ్వ జనని ఫౌండేషన్ ప్రతిభ పురస్కారాలలో భాగంగా జొన్నలగడ్డ రాజుకు ఈ అవార్డు వచ్చింది. సినీ ప్రముఖులు రెహమాన్, గౌతమరాజు, పరుచూరి శ్రీనివాసులు చేతుల మీదుగా అవార్డును ఆయన అందుకున్నారు. అవార్డు గ్రహీతను చింత నారాయణమూర్తి, పి.తాతీలు, అలీ వర్మ తదితరులు అభినందించారు.

పంపా అలలపై ఊరేగిన సత్యదేవుడు

ప్రజాశక్తి - శంఖవరం

కార్తీకమాసం సందర్భంగా అన్నవరం సత్యదేవుణ్ణి పంపా నది అలలపై అధికారులు ఊరేగించారు. ఆదివారం రాత్రి దేవస్థానం ఇఒ వీర్ల సుబ్బారావు, ఛైర్మన్ ఐ.విరోహిత్ ఆధ్వర్యంలో అర్చకులు పంపా తీరం వద్ద స్వామివారికి సతీసమేతంగా పూజలు చేశారు. అనంతరం పంప సరోవర తీరంలో పుష్పాలతో విద్యుత్ కాంతులతో ప్రత్యేకంగా అలంకరించిన హంస వాహనంపై సత్యదేవుని సతి సమేతంగా ఊరేగించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎ వరుపుల సత్య ప్రభ పాల్గొని వీక్షించారు. ఈ సందర్భంగా కోలాటం, భరత నాట్యం వంటి సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్లు బాబురావు, రమేష్‌బాబు, విశ్వనాథ్ రాజు, కూటమి నాయకులు పర్వత సురేష్, వెన్నా శివ, బాబి, వాసు, చిట్టిబాబు, నరసయ్య పాల్గొన్నారు.




హంస వాహనంపై ఊరేగిస్తున్న సత్యదేవుడు

మహిళా క్రికెట్‌కు పెరిగిన క్రేజ్

ప్రజాశక్తి - ఏలేశ్వరం, సామర్లకోట

క్రికెట్ అంటేనే పురుషుల క్రీడా అనే భావం నుంచి మహిళ క్రీడాకారులకు క్రమేపి మద్దతు పెరుగుతుంది. మహిళ క్రికెట్ ఫైనల్స్ ఆదివారం జరుగుతున్న నేపథ్యంలో ఏలేశ్వరంలోని టిడిపి కార్యాలయంలో మెగా స్క్రీన్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వార్డ్ కౌన్సిలర్లు బొదిరెడ్డి గోపి, మూది నారాయణస్వామి, నాయకులు రాయుడు చిన్న, రుచి రమేష్, కరోతు గాంధీ, పెద్ద ఎత్తున మహిళలు పాల్గొని క్రికెట్‌ను వీక్షించారు. అలాగే సామర్లకోట టిడిపి కార్యాలయంలో ఫైనల్ క్రికెట్ మ్యాచ్‌ను వీక్షించేందుకు భారీ ఎల్ఇడి స్క్రీన్‌ను ఏర్పాటు చేశారు. మహిళలు, టిడిపి నాయకులతో కలిసి ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప మ్యాచ్‌ను వీక్షించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్‌లు గొర్రెల జయలక్ష్మి, పిల్లాడి సత్యవతి, బలుసు వాసు, భీమేశ్వరాలయం ట్రస్ట్ బోర్డ్ ఛైర్మన్ కంటే జగదీష్ మోహన్, సభ్యురాలు కంచర్ల సుష్మా మోహిని, బొందల రామలక్ష్మి, టిడిపి నాయకులు బడుగు శ్రీకాంత్, అడబాల కుమారస్వామి, నూనె రామారావు పాల్గొన్నారు.



సామర్లకోటలో మ్యాచ్‌ను వీక్షిస్తున్న ఎంఎల్ఎ చినరాజప్ప

కార్టూ'నిజం'




ప్రాణాలు తీస్తున్న ప్రయివేట్ ఆసుపత్రులు

ప్రజాశక్తి - జగ్గంపేట

జగ్గంపేటలో ఉన్న పలు ప్రయివేటు ఆసుపత్రుల్లో సరియైన వైద్య సేవలు అందక రోగులు ప్రాణాలను కోల్పోతున్నారు. వైద్యులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ప్రాణాలను హరిస్తున్నారనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రులని పేర్లు పెట్టి వైద్యానికి వచ్చిన రోగుల నుంచి లక్షల్లో ఫీజులు గుంజుతున్నారనే విమర్శలు వస్తున్నాయి. ఇందులోభాగంగానే శనివారం జరిగిన సంఘటన ఇందుకు ఉదాహరణకు నిలుస్తోంది. గండేపల్లి మండపం పి.నాయకంపల్లి గ్రామానికి చెందిన కంటే వెంకట్రావు(70) గత కొంత కాలంగా స్థానిక సచివాలయం -2 వద్ద ఉన్న ప్రయివేట్ ఆసుపత్రిలో చికిత్స చేయించుకుంటున్నాడు. అతని కాలికి పుండు ఏర్పడటంతో నెలరోజుల క్రితం శస్త్ర చికిత్స చేశారు. రెండ్రోజులకు ఒకసారి ఆసుపత్రికి వచ్చి గాయానికి కట్టు మార్చుకుని వెళ్లమన్నారు. అలానే వచ్చి వెళ్తున్నాడు. ఆ చికిత్సకు వచ్చిన సందర్భంలోనే కడుపు ఉబ్బరంగా ఉందని వైద్యుడికి చెప్పడంతో అర కి.మీ. దూరంలో ఉన్న స్కానింగ్ సెంటర్‌కు వెళ్లి పరీక్షలు చేయించుకోవాలని చెప్పారు. అతను బంధువులు సహాయంతో స్కానింగ్ చేయించుకుని వచ్చారు. అలా చేయించుకుని వచ్చాక ప్రధాన వైద్యుడు లేకుండా సిబ్బంది చికిత్స చేశారని బాధితుని బంధువులు చెప్పారు. ఆ చికిత్స చేస్తున్న సందర్భంలో ఆ వృద్ధుడు మృతి చెందాడు. నడుచుకుంటూ ఆసుపత్రి లోపలికి వెళ్ళిన వ్యక్తికి వచ్చి రాని వైద్యం చేసి చంపేశారని బంధువులు ఆందోళనకు దిగారు. సిబ్బంది వైద్యుడికి ఫోన్ చేసి రోగి చనిపోయినట్లు వివరించారు. దీంతో బంధువులు ఆగ్రహించి అర్ధరాత్రి దాటక రాజమహేంద్రవరం పట్టణానికి చెందిన నాయకులతో కలిసి రెండు గంటల పాటు చర్చలు జరిపి పరిహారం అందించేందుకు ప్రధాన వైద్యులు ఒప్పుకున్నారు. దీంతో వారు శాంతించారు. ఐతే ఇటువంటి సంఘటనలు, పరిహారాలు ఇవ్వడం ఇదే ఆసుపత్రిలో గతంలో జరిగియాని స్థానికులు చెబుతున్నారు. ఇచ్చిన పరిహారాలను లాక్కునే విధంగా ఈ ఆసుపత్రిలో రోగులను రక్తాన్ని పీల్చుతున్నారని పలువురు బహిరంగంగా ఆరోపిస్తున్నారు.



ప్రయివేటు ఆసుపత్రిలో మృతి చెందిన వెంకట్రావు



ముద్రగడతో పళ్లంరాజు

ముద్రగడతో పళ్లంరాజు భేటీ

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

వైసిపి నాయకుడు, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభంను కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఎంఎం.పళ్లంరాజు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. కిర్లంపూడిలోని ముద్రగడ నివాసంలో పళ్లంరాజు కలిశారు. ముద్రగడ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రాజకీయ పరిణామాలపై వారిద్దరూ చర్చించుకున్నారు. రాజకీయాల్లో పదవుల కన్నా కుటుంబ గౌరవ మర్యాదలు ముఖ్యమని, అందుకు అనుగుణంగా ముందుకు నడుచుకోవాలని నియోజకవర్గ వైసిపి కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబుకు సూచించారు. ఈ భేటీలో మల్లిపూడి శ్రీ రామచంద్రమూర్తి, గౌతు స్వామి పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - గండేపల్లి

మండలంలోని నీలాద్రిరావుపేట శివారు చక్రవర్తి నగర్ జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..మధ్యప్రదేశ్ బద్వానీ జిల్లా చాంద్వా గ్రామానికి చెందిన సంజయ్ జాట్(30) వరి కోత మిషన్ పై డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. మోటార్ సైకిల్‌పై వస్తుండగా అతనిని కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతను అక్కడికక్కడే మతి చెందాడు. మృతదేహాన్ని పెద్దాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించామని ఎస్ఐ శివనాగు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

వ్యాన్ ఢీకొన్న ఘటనలో..

ప్రజాశక్తి -దేవరపల్లి

దుద్దుకూరు జాతీయ రహదారి ఫ్లయ్ ఓవర్ వద్ద ఆదివారం సాయంత్రం రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో రంగరాయ కాలనీ బంధపురం గ్రామానికి చెందిన వికలాంగుడు షేక్ హుస్సేన్ (50) బైకుపై వెళుతుండగా వ్యాన్ ఢీకొన్న సంఘటనలో రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్‌ను ఢీకొని అక్కకిక్కడే మృతి చెందాడు. ఆయనకు భార్య ముగ్గురు ఆడపిల్లలు ఉన్నారు.

సారా, మద్యం బాటిల్స్ స్వాధీనం : ఇద్దరు అరెస్ట్

ప్రజాశక్తి - కొత్తపేట

ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ శాఖ అధికారులు ఆదివారం నిర్వహించిన దాడుల్లో ఇద్దరిని సారా, బెల్లం ఊట, మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులు ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ సిఐ కె.కాత్యాయని తెలిపారు. వివరాలు ఇవి.. రావులపాలెం మండలం దేవరపల్లి గ్రామంలో నిర్వహించిన దాడుల్లో అప్పారి శ్రీనును ఆరు లీటర్ల నాటుసారా మరియు 500 లీటర్ల బెల్లం ఊట తోను, అదేవిధంగా కొత్తపేట మండలం పలివెల గ్రామంలో బెల్ట్ షాపు నిర్వహిస్తున్న పిల్లా వెంకటేశ్వరరావు వద్ద 180 మి.లీ ఏడు మద్యం బాటిళ్లతో అరెస్టు చేసినట్లు చెప్పారు. ఈ దాడులలో ఎస్ఐ కె.అన్నవరం సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు

ప్రజాశక్తి- తాళ్లపూడి

తాళ్లపూడి పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ టి.రామకృష్ణ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రమైన తాళ్లపూడికి చెందిన గూడా విజయరాజుకు అన్నదేవరపేట రెవెన్యూ పరిధిలో కొంత భూమి ఉంది. ఈ భూమితో పాటు విజయరాజు ఆధీనంలో ఉన్న మరో నాలుగు ఎకరాల్లో జామాయిల్ పండిస్తుండగా షణ్ముఖం వెంకటేశ్వరరావు, వెలుగుబంటి రామకృష్ణ, షణ్ముఖం ఆనంద్ సుమారు రూ.రెండున్నర లక్షల విలువైన జామాయిల్ పంట కోసుకుపోయారని ఫిర్యాదులో పేర్కొన్నారు. మరల పంట కోయడానికి వచ్చిన సమయంలో తాను అడ్డుకోవడంతో కులం పేరుతో దూషించడమే కాక చంపుతానని బెదిరించారని బాధితుడు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారని ఎస్ఐ తెలిపారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

ప్రజాశక్తి-కొవ్వూరు

గత నెల 25వ తేదీ నుంచి చల్లా భాస్కరరావు అనే వ్యక్తి కనిపించడం లేదని ఆయన కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆదివారం కేసు నమోదు చేసినట్టు కొవ్వూరు పట్టణ సిఐ పి.విశ్వం తెలిపారు. పార్వతీపురం మన్యం జిల్లా ముక్కు మండలం నాయుడువలసకు చెందిన భాస్కర్ రావు తన గ్రామానికి చెందిన 18 మంది కూలీలతో బంగారమ్మపేటలో రైస్‌మిల్లులో పని చేసేందుకు వచ్చాడు. గత నెల 25న ఇంటికి వెళ్లి వస్తానని చెప్పి వెళ్లి ఇంతవరకు ఇంటికి చేరుకోలేదన్నారు. దీంతో ఆదివారం పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు సిఐ తెలిపారు. వివరాలు తెలిసినవారు 944079662 నెంబర్‌కు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

బలవంతపు పెళ్లిపై విద్యార్థిని ఫిర్యాదు

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలో మునికూడలికి ఒక విద్యార్థినిపై ఆరుగురు వ్యక్తులు బలవంతంగా దాడి చేసి, బెదిరించి వివాహం జరిపించినట్టు ఆదివారం జిల్లా ఎస్‌పికి ఫిర్యాదు చేశారు. బి.టెక్ చదువుతున్న ఒక విద్యార్థిని ఇంటికి గత నెల 10న ఆమె స్నేహిడుతు వచ్చాడు. ఆ సమయంలో పేటలోని చిడిపి స్టాలిన్, అనిమెల్లి సురేష్, కొడమంచిలి సుబ్బారావు, కొడమంచిలి తేజ, అనిమెల్లి సుధాకర్, అనిమెల్లి నాగేంద్ర విద్యార్థిని, ఆమె స్నేహితునిపై దాడి చేశారు. అనంతరం విద్యార్థిని మెడలో బలవంతంగా తాళి కట్టించారు. విద్యార్థిని ఫిర్యాదు మేరకు ఆరుగురు వ్యక్తులపై సీతానగరం ఎస్ఐ రామ్‌కుమార్ కేసునమోదు చేశారు.

ట్రావెల్స్ బస్సు సీజ్

ప్రజాశక్తి - ముమ్మిడివరం

కర్నూలు ట్రావెల్ బస్ ఘటన నేపథ్యంలో రవాణా శాఖ అధికారులు ముమ్మర తనిఖీలు నిరంతరం కొనసాగుతున్నాయి. మండలంలోని అన్నంపల్లిటోల్ ప్లాజా వద్ద శనివారం రాత్రి చేపట్టిన ప్రత్యేక తనిఖీల్లో ప్రమాణాలు సక్రమంగా లేని జయంతి ప్రయివేటు ట్రావెల్స్ బస్సుపై కేసులు నమోదు చేసి సీజ్ చేశామన్నారు. ఇప్పటివరకు 57 బస్సులను తనిఖీ చేసి, ప్రమాణాలు పాటించని ఎనిమిది బస్సులపై కేసులు నమోదు చేసి సీజ్ చేయడమే కాకుండా, ఫిట్‌నెస్ రద్దు చేశామని జిల్లా రవాణాధికారి దేవిశెట్టి శ్రీనివాసరావు తెలిపారు. సీజ్ చేసిన ఎనిమిది బస్సులలో అనధికారికంగా సీట్ల మార్పిడి చేసినట్లు గుర్తించామని, ఇది మోటారు వాహనాల చట్టం ఉల్లంఘన క్రింద మూడు బస్సులను సీజ్ చేసి స్థానిక పోలీస్ స్టేషన్‌కు అప్పగించామని శ్రీనివాసరావు తెలిపారు. సీజ్ చేసిన బస్సులు యానాం నుంచి హైదరాబాద్‌కి నిత్యం తిరుగుతున్నా యని, ఇకపై తనిఖీలను ముమ్మురం చేస్తామని ఆయన తెలిపారు. ఈ తనిఖీల్లో మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, జ్యోతి సురేష్, కౌశిక్ పాల్గొన్నారు.

జాగ్రత్తలే ఉద్యాన వన పంటలకు రక్షణ

'ప్రజాశక్తి'తో జిల్లా ఉద్యాన వన శాఖ అధికారి టివి.సిరిల్



ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

మొంథా వంటి తుపానులు వచ్చినప్పుడు సరైన జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా ఉద్యాన పంటలకు నష్టం జరగకుండా నివారించవచ్చునని జిల్లా ఉద్యాన వన అధికారి టివి.సిరిల్ అన్నారు. అరటికి భారీగా నష్టం వాటిల్లే అవకాశం ఉన్నందున అరటి పంటను రైతులు తక్షణం స్పందించి చర్యలు తీసుకుంటే పూర్తిగా పంటను రక్షించుకోవచ్చునన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో అరటి సంరక్షణపై పలు అంశాలను వివరించారు.

నీటిని ఎంతవరకు ఉపయోగించాలి.?

అరటి తోటల్లో మురుగునీటి వసతి కల్పించి, నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి. పంట పది గంటలకు మించి ముంపునకు గురయితే అధిక శాతం మొక్కలు చనిపోయే అవకాశం ఉంది. అందువల్ల ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవాలి. పంట తేరుకోవడానికి లీటరు నీటికి 5 గ్రాముల పొటాషియం నైట్రేట్ కలిపిన ద్రావణాన్ని వారం రోజుల వ్యవధిలో 2-3 సార్లు పిచికారీ చేయాలి. ఎకరానికి అదనంగా 20 కిలోల యూరియా, 15 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ ఎరువులను వేసుకోవాలి. తోటలో ఆరుదల వచ్చేలా చూడాలి. ట్రైకోడేరా విరిడి జీవ నియంత్రకాన్ని ఎకరానికి 2 కిలోల చొప్పున 100 కిలోల పశువుల ఎరువుతో కాని, వర్మి కంపోస్ట్ కాని కలిపి చల్లుకోవాలి.

నీటిలో మునిగితే సంరక్షణ చర్యలు తీసుకోవాలి.?

మూడు నెలలు కంటే చిన్న వయసు గల మొక్కలు 4-5 రోజులపాటు 2-3 అడుగుల లోతు నీటిలో మునిగినప్పుడు వేరు వ్యవస్థ పూర్తిగా కుళ్లిపోయే ప్రమాదముంది. నీరు లాగిన వెంటనే మొక్కలను తీసివేసి, నేల ఆరిన తరువాత తేలికపాటి దుక్కి చేసి, ఎంపిక చేసిన రకానికి సిఫారసు చేసిన దూరంలో 45-45-45 సెం.మీ పొడవు, వెడల్పు, లోతు గల గుంటలు తీసి టిష్యూ కల్చర్ (లేదా) విత్తన శుద్ధి చేసిన తెగుళ్ల లేని సూది పిలకలను మళ్లీ నాటుకోవాలి. ఐదారు నెలల వయసు ఉండి గెలలు వేసే దశలో ఉన్న మొక్కలు ఉన్న తోటల్లో ఐదు రోజుల కంటే ఎక్కువగా, 3 అడుగుల నీటి లోతులో ఉన్న మొక్కల వేరు వ్యవస్థ పూర్తిగా కుళ్లిపోతుంది. ఈ మొక్కలు నీరు ఆరిన తరువాత కూడా బతకడం కష్టం. ఐదు రోజుల కంటే తక్కువగా నీటి ముంపునకు గురి అయినప్పుడు వేరు వ్యవస్థ పాక్షికంగా దెబ్బతింటుంది.

వర్షాల సమయంలో తెగుళ్లు ఆశిస్తాయా.?

గాలిలో అధిక తేమ కారణంగా తెల్ల చక్కెర కేళి, గ్రాండ్‌నైన్, వామన కేళి వంటి రకాలలో సిగటోకా ఆకుమచ్చ తెగులు అధికంగా ఆశించడానికి అవకాశం ఉంది. నేలలో అధిక తేమ వలన బ్యాక్టీరియా దుంప కుళ్లు ఆశించవచ్చు.

తెగుళ్ల నివారణకు ఎటువంటి చర్యలు తీసుకోవాలి.?

సాధ్యమైనంత త్వరగా ముంపు నీటిని మురుగునీటి కాల్వల ద్వారా బయటకు పంపే ప్రయత్నం చేయాలి. నేల ఆరిన తరువాత అంతర సేద్యం చేసి మొక్క ఒక్కింటికి 100 గ్రా యూరియా, 80 గ్రాముల మ్యూరేట్ ఆఫ్ పొటాష్, 20-25 రోజుల వ్యవధిలో 2 నుంచి 3 దఫాలు వేయాలి.

ఏయే మందులు ఎన్నిసార్లు పిచికారి చేయాలి.?

ఆకులు తడిసేలా ఐదు గ్రాముల పొటాషియం నైట్రేట్ ఒక లీటరు నీటికి చొప్పున తగినంత జిగురు కలిపి వారంరోజుల వ్యవధిలో మూడుసార్లు పిచికారీ చేయాలి. సిగటోకా ఆకుమచ్చ తెగులు నివారణకు ప్రోపికొనజోల్ 1 మి.లీ మందును లీటరు నీటికి కలిపి జిగురుతో పాటు పిచికారీ చేయాలి. అరటి దుంపలు కుళ్లిపోకుండా నివారించడానికి కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రాముల మందును లీటరు నీటిలో కలిపి లేదా బోర్డో మిశ్రమం 1 శాతం దుంప చుట్టూ తడిసే విధంగా పోయాలి.

దుంపకుళ్ళు ఆశిస్తే ఏం చేయాలి.?

దుంపకుళ్లు ఆశించిన మొక్కలను గమనించి, వాటి చుట్టూ 25 గ్రాముల బ్లీచింగ్ పొడి ఒక లీటరు నీటిలో కలిపి మొదలు తడిసేలా పోయాలి. అవసరాన్ని బట్టి 15 రోజుల తర్వాత మళ్లీ పోయాలి. తర్వాత ఈ మొక్కల మొదళ్లలో 50 గ్రాముల సూడోమోనాస్, 250 గ్రాముల వేపపిండితో కలిపి వేయాలి.



పూర్తిగా గెలలు విడిచిన, 75 శాతం లోపల గెల తయారీకి వచ్చిన దశలో ఉన్న తోటల్లో ముంపునీరు వల్ల వేరు వ్యవస్థ పాక్షికంగా (లేదా) పూర్తిగా దెబ్బతింటుంది. దీనివలన గెల తయారీకి అవసరమైన నీరు, పోషక పదార్థాలు మొక్క తీసుకోలేదు, తద్వారా గెల పూర్తిగా తయారవ్వకుండా, పక్వానికి వచ్చి నష్టం కలుగుతుంది.

ముంపునీటి సమస్యలు ఏ విధంగా పరిష్కరించాలి.?

ముంపు నీటిని సాధ్యమైనంత త్వరగా తోట నుంచి బయటకు పంపి భూమి ఆరే విధంగా చేయాలి. ఆకులు, గెలలు బాగా తడిసే విధంగా లీటరు నీటికి ఐదు గ్రాముల సల్ఫేట్ ఆఫ్ పొటాష్, ఐదు గ్రాముల పొటాషియం నైట్రేట్ ఎరువులను వెంటనే మూడు రోజుల వ్యవధిలో మూడుసార్లు ఒక దాని తరువాత మరొకటి పిచికారీ చేసుకోవాలి. గెలలను ఎండిన అరటి ఆకులతో కప్పివుంచి 15 రోజులలో మార్కెట్ చేసుకోవాలి. వెదురు కర్రతో ఊతమిచ్చి మొక్కలు పడిపోకుండా చేసుకోవాలి. నేలలో మొక్క చుట్టూ గాడిలో 100 గ్రాముల యూరియా, 80 గ్రాముల మ్యురియేట్ అప్ పోటాష్ వేసుకోవాలి.

కమ్యూనిటీ భవనానికి శంకుస్థాపన

ప్రజాశక్తి - గండేపల్లి

గండేపల్లిలో ఆర్యవైశ్యుల కమ్యూనిటీ భవన నిర్మాణానికి ఎంఎల్‌ఎ జ్యోతుల నెహ్రూ శంకుస్థాపన చేశారు. ఆదివారం కార్తిక మాసం సందర్భంగా ఆర్యవైశ్యుల అన్న సమురాధన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌ఎ పాల్గొని ఆర్యవైశ్యుల కమ్యూనిటీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత మండల అధ్యక్షుడు సుంకపల్లి రమేష్, టిడిపి గ్రామ మాజీ అధ్యక్షులు ఎల్లమాటి కాశీ, వెంపాటి రాజు, విప్పర్ల బాబి, చాగంటి వీరవెంకట సత్యనారాయణ, వైసిపి నాయకులు మద్దిపట్ల రామకృష్ణ, ఆర్యవైశ్య సంఘ అధ్యక్షులు వాకర్చర్ల బాబ్జి, సంఘ సభ్యులు పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ

విజయవంతంగా ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - సామర్లకోట

సామర్లకోట ఫ్రెండ్స్ గ్రౌండ్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది. ప్రతి నెల మొదటి ఆదివారం నిర్వహించే క్యాంపు నిరంతరాయంగా కొనసాగుతున్నదని వాకర్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ విప్పర్తి కొండలరావు తెలిపారు. వైద్య శిబిరానికి అవసరమైన మెటీరియల్‌ను అందించిన దాతలు అంబటి అప్పారావు, మారేశ్వరి దంపతులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. డాక్టర్ శ్రీధర్ వైద్య సేవలు అందించారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ కోఆప్షన్ సభ్యులు సత్యానందం, మణిరాజు, కోశాధికారి గుండు శంకర్రావు, కమిటీ సభ్యులు లింగం శివప్రసాద్, కుంచె శ్రీనివాసు, సింగంపల్లి శ్రీనివాసు, బుల్లి రాజు, స్టూడియో ప్రసాద్ పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

యాత్రికుల రద్దీకి తగ్గట్టుగా ఏర్పాట్లు

ప్రజాశక్తి - సామర్లకోట

కార్తీకమాసం పురష్కరించుకుని ఆలయానికి వచ్చే యాత్రికుల రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లు చేయాలని మానవ హక్కుల సంఘ అధ్యక్షులు నూతలపాటి అప్పలకొండ కోరారు. ఆదివారం భీమేశ్వర ఆలయ కార్యనిర్వహణాధికారి బల్ల నీలకంఠంను ఆయన కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాశీబుగ్గలో జరిగిన ఘటనను దృష్టిలో ఉంచుకుని ఆలయాల్లో భక్తుల రద్దీ నియంత్రణకు అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. భీమేశ్వర ఆలయానికి రాష్ట్ర నలుమూలల నుంచి యాత్రికులు రానున్నందున అవసరమైన సౌకర్యాలు, భద్రతా ఏర్పాట్లు చేయాలని ఆయన కోరారు. ముఖ్యంగా భద్రద విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మానవ హక్కుల సంఘ నాయకులు కుంచె నానిబాబు, జుత్తుక అప్పారావు, వల్లీ భాషా, మున్వర్ పాల్గొన్నారు.

వైసిపి ఆధ్వర్యాన కొవ్వొత్తుల ర్యాలీ

ప్రజాశక్తి - కోటనందూరు

కాశీబుగ్గ తొక్కిసలాటలో ప్రాణాలు కోల్పోయిన మృతులకు నివాళిగా వైసిపి ఆధ్వర్యంలో తునిలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వంలో దేవాలయాలకు వెళ్తున్న యాత్రికుల ప్రాణాలకు రక్షణ లేకుండా పోతుందని వైసిపి నాయకుడు రేలంగి రమణగౌడ్ విమర్శించారు. కూటమి పాలనలోనే తిరుపతి, సింహాచలం, కాశీబుగ్గ పుణ్యక్షేత్రాల్లో యాత్రికులకు రక్షణ కల్పించకపోవడంతో తొక్కిసలాట, గోడకూలిపోవడాలతో ప్రాణాలు కోల్పోతున్నారని అన్నారు.

జోగి రమేష్ అరెస్టుకు ఖండన

దేవాలయాల్లో యాత్రికుల మరణాలను పక్కదోవ పట్టేంచేందుకే వైసిపి నాయకుడు జోగి రమేష్‌ను అరెస్టు చేశారని రమణగౌడ్ ఆరోపించారు. ఈ కార్యక్రమంలో శ్రీను, జమీలు, సకురు నాగేంద్ర నెహ్రూ, లంక కపానందం, కీర్తి రాఘవ, డి. నాగేశ్వర రావు శ్రీను బొడపాటి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

జగ్గంపేటలో...

అలాగే కాశీబుగ్గ వెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద జరిగిన తొక్కిసలాటలో మతిచెందిన వారికి సంతాపంగా వైసిపి నాయకులు కొవ్వొత్తుల ప్రదర్శన చేపట్టారు. పార్టీ మండల అధ్యక్షులు రావుల గణేష్‌రాజా ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో రాజపూడి ఎంపిటిసి నంగన నాని, మన్యంవారిపాలెం సర్పంచ్ పోట్రు వీర్రాజు, రాష్ట్ర పబ్లిసిటీ విభాగం ప్రధాన కార్యదర్శి రామకుర్తి జగాలు, టౌన్ అధ్యక్షులు కాపవరపు ప్రసాద్, పాలిపిరెడ్డి సత్తిబాబు, గాది కృష్ణ, కార్మిక విభాగం అధ్యక్షుడు గుర్రం మహాలక్ష్మి, జగ్గంపేట మండలం ఉపాధ్యక్షులు భూమాడ గణపతిరావు, వానాసి సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.



తునిలో కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న వైసిపి శ్రేణులు

యానాం వార్తలు



నిరసన వ్యక్తం చేస్తున్న అధ్యాపకులు

ప్రమోషన్స్ అమలుకు నిరసన

ప్రజాశక్తి - యానాం

అధ్యాపకులకు పదోన్నతులు కల్పించాలని కోరుతూ అధ్యాపకులు నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. జెఎసి కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఎస్ఆర్‌కె ప్రభుత్వ డిగ్రీకళాశాల వద్ద ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2016 నిపుణుల కమిటీ సిఫార్సుల ఆధారంగా పదోన్నతుల కోసం ప్రొఫెసర్లు దరఖాస్తులు సమర్పించారని తెలిపారు. కానీ ప్రభుత్వం వాటిని అమలు చేయడంలో అలసత్వం ప్రదర్శిస్తుందన్నారు. దీనివల్ల ఆర్థిక బకాయిలు, పదోన్నతులు కోల్పోతున్నామని అన్నారు. అనంతరం ఆర్ఎఒ అంకిత్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ధనయోగ్ సింగ్, జెఎసి సభ్యులు యోగేందర్సింగ్, వి.శ్రీదేవి, ఉమాదేవి, ఎన్.ఝాన్సీరాణి, టి.సుబ్బలక్ష్మీ, శాంతరాజు, చక్రవర్తి, టి.ప్రసాదరావు, టి.ముత్యాలు పాల్గొన్నారు.

ముగిసిన విజిలెన్స్ అవేర్నెస్ వీక్

ప్రజాశక్తి - యానాం

సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ ఆధ్వర్యంలో వారం రోజులుగా వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన విజిలెన్స్ అవేర్నెస్ వీక్ ఆదివారం యానంలో ఘనంగా ముగిసింది. ఈ కార్యక్రమంలో ఆర్ఎఒ అంకిత్‌కుమార్ పాల్గొన్నారు. తొలుత యానాంలో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యోగులతో ఆర్ఎఒ అంకిత్‌కుమార్, సిబిఐ అడిషనల్ ఎస్‌పి సిఆర్.దాస్ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం స్థానిక ఎస్ఆర్‌కె ఆర్ట్స్ కళాశాల కాన్ఫరెన్స్ హాల్లో అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం క్విజ్ పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి డిడి రవిశంకర్, ఎడి పలాస్‌కుమార్, ఎస్ఐలు పుణీత్‌రాజ్, కట్టా సుబ్బరాజు, ట్రాఫిక్ ఎస్ఐ నూకరాజు, సిబిఐ సిబ్బంది, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

శెట్టిబలిజ సంఘం అధ్యక్షుడిగా చీకట్ల

ప్రజాశక్తి - యానాం

యానాం శెట్టిబలిజ సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. స్థానిక జివిఎస్ మినీ ఫంక్షన్ హాల్లో జరిగిన సమావేశంలో నూతన అధ్యక్షులుగా చీకట్ల సత్యనారాయణ, ఉపాధ్యక్షుడిగా కాకి నాగేశ్వరరావు, చింతాకుల రామకృష్ణ, నక్కల భువనేశ్వరరావు, చీకట్ల రామకష్ణ, కోశాధికారిగా సూరంపూడి గిరీష్, కార్యదర్శిగా గెద్దాడ శ్యాం కుమార్, సంయుక్త కార్యదర్శిగా బొక్క వెంకన్న బాబు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో ముమ్మిడివరం ఎఎంసి ఛైర్మన్ కుడుపూడి శివన్నారాయణ, గుత్తుల గోవింద జయరామారావు, పితాని భాస్కర్, పిల్లి త్రిమూర్తులు, దంగేటి త్రిమూర్తులు పాల్గొన్నారు. నూతన కార్యవర్గాన్ని సన్మానించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గానికి పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు శుభాకాంక్షలు తెలిపారు.

అశోక్‌కు కవితా పురస్కారం

ప్రజాశక్తి - యానాం

కవి, పాత్రికేయుడు పొనుగుమట్ల అశోక్‌కుమార్ కవితా పురస్కారంకు ఎంపికయ్యారు. ఆదివారం మల్లెతీగ సాహిత్య సేవాసంస్థ అధ్యక్షులు కలిమిశ్రీ నుంచి సమాచారం అందినట్టు ఆయన తెలిపారు. ఇటీవల ఎన్‌టిఆర్ జిల్లా యంత్రాంగం, ఆంధ్రప్రదేశ్ పర్యాటకశాఖ సౌజన్యంతో మల్లెతీగ సాహిత్య సేవాసంస్థ నిర్వహించిన కవితల పోటీలో రాసిన కవితకు కన్సోలేషన్ విభాగంలో బహుమతికి ఎంపికయిందని తెలిపారు. ఈ నెల 22, 23 తేదీలలో విజయవాడలో జరిగే కార్యక్రమంలో మెమెంటో, నగదు బహుమతి అందించి సత్కరించనున్నారు.



దుప్పట్లు పంపిణీ చేస్తున్న శ్రీనివాస్

దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి - గొల్లప్రోలు

మండలంలోని చేబ్రోలు గ్రామంలో ఆదివారం స్థానిక జనసేన నాయకులు ఓదూరి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో పేదలకు భోజనాలతో పాటు దుప్పట్లు పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ పిఠాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ మర్రెడ్డి శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు ఓదూరి కిషోర్, ఎపి పద్మశాలి వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ సూరిశెట్టి జయకృష్ణ, చల్లా చినబాబు పాల్గొన్నారు.

వేణుగోపాలుని గ్రామోత్సవం

ప్రజాశక్తి - పిఠాపురం

స్థానిక వేణుగోపాలస్వామి వార్షిక కల్యాణ వేడుకల్లో భాగంగా స్వామివారిని శేష వాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. మంగళవారం సాయంత్రం 6 గంటలకు రథోత్సవ కార్యక్రమం జరుగుతుందని కార్యనిర్వహణ అధికారి నున్న శ్రీరాములు తెలిపారు. ఈ వేడుకలో అర్చకులు విజయజనార్ధనాచార్యులు, వేణుగోపాలస్వామి ఆలయాభివృద్ధి సేవాసమితి అధ్యక్షుడు చెరుకుపల్లి శ్రీనివాస్, సభ్యులు, పాల్గొన్నారు.